కలెక్టర్ బాలాజీ విశాలాంధ్ర 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నూతన సంవత్సరం 2026 విశాలాంధ్ర క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డీకె.బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, కృష్ణాజిల్లా సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరప్రసాద్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రాధిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రిక కార్యాలయం యాజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర కృష్ణాజిల్లా ప్రతినిధి వీరపనేని నాగేశ్వరరావు, విశాలాంధ్ర బంటుమిల్లి మండలం పాత్రికేయులు మాగంటి కనక చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు గోతులు మరిచారు

రోడ్డుకు మధ్యలో వదలిన వాల్క్సి మూతలు

విశాలాంధ్ర-గుడివాడ : రోడ్డులు వేశారు గోతులు మరిచారు. అనే విశాలాంధ్ర వార్తకు స్పందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో మాట్లాడి రోడ్డు మధ్యలో వదలి వేసిన వాల్వ్ మూతలు బిగించారు. స్థానిక అరవ పేటలో నిర్మించిన రోడ్డుకు మూతలు వదలి వేయడంతో ప్రజా సమస్యలను ప్రచురించిన విశాలాంధ్ర కు అరవపేట ప్రజలు అభినందనలు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కూడ ధాన్యవాదలు తెలిపారు.

మాటనిలబెట్టుకున్న సీఎం : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర - గుడివాడ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతి పెన్షన్ దారుడు కృతజ్ఞతలు తెలపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం పట్టణంలో పలు వార్డులు నియోజవర్గంలో పలు ప్రాంతాలలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెన్షన్ నగదు అందుకునేటప్పుడు లబ్ధిదారులు మోములో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, నాయకులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో నగరోత్సవం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక కాకర్ల వీధిలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్వామివారి నగరోత్సవం దేవదాయశాఖ, దేవస్థాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, ఈవో గోపాలరావులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించి నగరోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామివారి ఉత్తర దర్శనం అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగరోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.

'పది' పరీక్షలకు సిద్ధపడాలి : డీవైఈఓ

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలంలోని పాఠశాలలను ఉయ్యూరు డివైఈవోఐ పద్మారాణి బుధవారం పరిశీలించి తనిఖీలు నిర్వహించారు.వచ్చే సంవత్సరం మార్చి 16వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు కొనసాగిస్తున్న వంద రోజులు యాక్షన్ ప్లాన్ అమలు పై ఆయాపాఠశాలల్లో పరిశీలించి విద్యార్థులకు అభ్యాసనపైపలు సూచనలు ఇచ్చారు. ఆమె మొవ్వ పీఎం శ్రీశ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ లో148 మంది విద్యార్థులు గల మూడుసెక్షనులలో, కోసూరు శ్రీతుమ్మలవిజయవిలాస రాజ్యలక్ష్మి ఉన్నత పాఠశాలలో 27 మంది విద్యార్థులతో, కాజ శ్రీ పేకేటినరసారెడ్డిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండుసెక్షన్లలోగల56 మందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రాథమిక స్థాయిలో నిర్వహించేనిఎఫ్. ఎల్. ఎన్ 75 రోజుల ప్రోగ్రాంనుఅమలుపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 ఏ భాను ప్రకాష్, ఎంఈఓ 2 కే శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు నిమ్మగడ్డఉమాశ్రీ (మొవ్వ) వెనిగళ్ళవెంకట సతీష్ (కోసూరు ఇన్చార్జి), టి వెంకటరమణి(కాజ),సూరిశెట్టి శ్రీనివాస నెహ్రూ (కాజ రెగ్యులర్) పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల స్థాయిలో అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో 6,7 తరగతులకు, జిల్లా పరిషత్, ఎయిడెడ్ హై స్కూల్ లోని ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు సబ్జెక్టులో స్పెల్లింగ్, మీనింగ్, యూసేజ్, మరియు రీడింగ్ (స్పెల్-బి)లోనిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులు జనవరి రెండవ తారీఖున మచిలీపట్నంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారని మండల విద్యాశాఖ అధికారి-1 ఏ భాను ప్రకాష్, ఎం ఈ ఓ-2 కే శ్రీలక్ష్మి బుధవారం తెలిపారు. మండల స్థాయిలో వీరికి ఆయా పాఠశాలల్లో పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ పోటీలను 9 జిల్లా పరిషత్ పాఠశాలలు, పెదముత్తేవి ఎయిడెడ్ సంస్కృత ఉన్నతపాఠశాల, మంత్రి పాలెం, నిడుమోలు (ఉర్దూ) యూపీ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో తరగతుల వారీగా పెదపూడి, నిడుమోలు, మొవ్వ హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని వివరించారు.

ప్రాంతీయ బాల బాలికల ఛాంపియన్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: ప్రాంతీయ బాల బాలికల ఆటల పోటీలు (ఐపిఎస్జిఎం-2025-26) రీజినల్ మీట్ ను విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ లో ఈ నెల ది: 29, 30 తేదీలలో ఉమ్మడి కృష్ణా, ఎన్.టీ.ఆర్. జిల్లాలకు నిర్వహించారు. ఈ మీట్ లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ బాల బాలికలకే గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ లు రావడం విశేషం. అంతే కాకుండా బాల బాలికల స్పోర్ట్స్ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ ను కూడా మా గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులైనా డి.వర్ష వెంకట దుర్గ, బి.శరణ తేజ్ లకు రావడం హర్షించతగ్గ విషయమని ప్రిన్సిపాల్ శ్రీ ఎన్.రాజశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ మీట్ లో బాలురను మించి అత్యుత్తమ ప్రదర్శనను చాటిన బాలికలను వారిని ప్రోత్సహించిన తల్లితండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ఈ ఘన విజయానికి క్రీడా ఉపాధ్యాయులు, కోచ్లు అందించిన శిక్షణతో పాటు కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ప్రోత్సాహం ప్రధాన కారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే విధమైన విజయాలు సాధించాలని, ఈ విజయంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, క్రీడలతో పాటు విద్యలో కూడా మరింత ప్రతిభ కనబరుస్తారని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేసారు. బాలికల గేమ్స్ వాలీ బాల్, ఖో-ఖో, టేబుల్ టెన్నిస్ డబుల్స్ అండ్ సింగిల్స్, బాడ్మింటన్ డబుల్స్ అండ్ సింగిల్స్ విభాగాలలో విన్నర్స్ గాను నిలిచారు. అదేవిధంగా బాలికల స్పోర్ట్స్ 200 మీ, 100 ఇ4 రిలే, లాంగ్ జంప్, విభాగాలలో మొదటి స్థానం , 100 మీ, 400 మీ, ట్రిపుల్ జంప్ లో మొదటి & ద్వితీయ, 800 మీ లో మొదటి & తృతీయ స్థానాన్ని , హైజంప్ లో ద్వితీయ, డిస్కస్ త్రో విభాగంలో తృతీయ స్థానాన్ని సాధించారు. బాలురు గేమ్స్ కబడ్డీ, షటిల్ డబుల్స్ విభాగాలలో విన్నర్స్ గాను, వాలీబాల్, బాల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ అండ్ డబుల్స్, చెస్ నందు రన్నర్స్ గా నిలిచారు. బాలుర స్పోర్ట్స్ 200 మీ, 800 మీ, 4 ఇ 100 రిలే, 4ఇ400 రిలే, జావలిన్ విభాగాలలో మొదటి స్థానాన్ని, 100 మీ లో మొదటి & ద్వితీయ స్థానాన్ని, 400 మీ, 1500 మీలో ద్వితీయ స్థానాన్ని, హై జంప్ లో ద్వితీయ అండ్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలుగా నిలిచినా విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను విజయవాడ కార్పొరేటర్ మరియు గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చేతులు మీదుగా అందచేయడం జరిగింది. ప్రాంతీయ స్థాయి విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఫిబ్రవరి 28 నుండి 30 వరకు ఎస్.వి.గవర్నమెంట్ పాలిటెక్నిక్, తిరుపతి లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రతి నెల క్రమం తప్పకుండా పింఛన్లు : మంత్రి కొల్లు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల క్రమం తప్పకుండా నెలలో మొదటి తేదీన పింఛన్లు అందిస్తున్నామని, మొదటి తేదీ ఆదివారం లేదా పండుగకు లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ఒకరోజు ముందే పింఛన్లు అందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర గుర్తు చేశారు. బుధవారం ఉదయం మచిలీపట్నం మండలం బర్రెపోతుపాలెం గ్రామంలో లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్లు అందించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ముందురోజే పింఛన్లు అందించామని, సంతోషంగా పండుగ జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో దాదాపు 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని, దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం సంవత్సర కాలంలో 50 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో 200 ఉన్న పింఛన్ ను ఇప్పుడు 4 వేలకు పెంచి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తు వస్తున్నామని, పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, నిరుపేదలకు, అభాగ్యులకు సకాలంలో పింఛన్లు అందించి ఆదుకుంటోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వర రావు, జడ్పీటీసీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ అథారిటీ డైరెక్టర్ లంకె ప్రసాద్; మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యన్నారాయణ, కూటమి నాయకులు వన్నెం సునీల్, యలకుర్తి విష్ణు, సాయిరాం, మాదివాడ రాము, గడ్డం రాజు, మదుసూదన రావు, సోమశేఖర్, సిహెచ్.ఒ అన్నామణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ, డీఆర్డీఓ కె. చంద్రశేఖర రావుతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని ముందుగా ప్రజా ప్రతినిదులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కీలకమైన అంశాలను ప్రజా ప్రతినిదులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రధానంగా కృష్ణాజిల్లా వ్యవసాయ ప్రాంతమని, జిల్లా ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రాథమిక రంగమైన వ్యవసాయం, ఉద్యానవనం, ఆక్వాకల్చర్, పాడి పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చామని, అన్ని రంగాల్లో జిల్లా డొమెస్టిక్ ఉత్పత్తి పెంపొందించడానికి పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సారి పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా అధిక ఆదాయం పెంచే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. జిల్లాలో దాదాపు 7,500 దాకా ఆడపశువులు జన్మించేలా ఉత్పత్తి పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నామని, సెక్స్ సార్టెడ్ సెమెన్‌తో కృత్రిమ గర్భధారణ చేసి ఆడ పశువులు జన్మించే విధంగా కృషి చేశామని, ఒక్కొక్క ఇంజెక్షన్ 300 కాగా రైతులకు ప్రభుత్వం100రూపాయలు రాయితీ, విజయ పాలడైరీ సహకారంతో మరో 100 రూపాయలు రాయితీ అందించడంతో కేవలం 100 కే పాడి రైతులకు లభించే అవకాశం కల్పించామని, జిల్లాలో ఆక్వాకల్చర్ సాగు చాలా పెద్ద స్థాయిలో జరుగుతోందని, 60,925 ఎకరాల్లో ఆక్వాజోన్ జరుగుతొందని, రానున్న రోజుల్లో మరింత విస్తరించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన 10 సూత్రాల్లో డీప్టెక్ కార్యక్రమాన్ని నందివాడలో ప్రయోగాత్మకంగా చేపట్టామని, ఉన్నత ప్రమాణాలతో ఉత్పత్తులుండటంతో బ్యాంకు రుణాలు, భీమా సౌకర్యం కలిగిస్తామన్నారు.ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం తో యూనిట్లు మంజూరు చేశామనివాటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుటుంబం ఒక వ్యాపారవేత్త నినాదంతో జీవనోపాదులను కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు లింకేజిల్లో రాష్ట్రంలో కృష్ణాజిల్లా మొదటి స్థానంలోనిలిచిందన్నారు. ఈ సంవత్సరం 42 బాలికల వసతిగృహాలకు అవసరమైన ఇన్సినేరేటర్లు, విద్యార్థులకు 534 చిన్నసైజు బల్లల ను అందజేయనున్నామని తెలిపారు. జిల్లాలో ఇన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి సజావుగా వాటిని అమలు చేయడానికి సహకారం అందిస్తున్న ప్రజాప్రతినిదులు, ప్రభుత్వ ఉద్యోగులు, అదరికి టీం కృష్ణ అందరిఈన అబినందిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో విశేషంగా కృషి చేస్తున్న ప్రజాస్వామ్యానికి మూల స్తంబాల్లో ఒకటైన మీడియా ప్రతినిదులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని కలెక్టర్ అన్నారు.

భక్తులకు శ్రీ కొండలమ్మ అమ్మవారి నూతన సంవత్సర క్యాలెండర్ అందజేత

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం తాలుకా 2026 వ సంవత్సరమునకు నూతన క్యాలెండర్లను మంగళవారం గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము స్వహస్తములతో ఆవిష్కరించగా బుధవారం శ్రీ అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే. వెంకట విష్ణు మోహనరావు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వహస్తములతో భక్తులకు క్యాలెండర్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే. వెంకట విష్ణు మోహనరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు, షాపుల వారు మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొనారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి చేస్తునమని తెలిపారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. ఆయన తన పరిపాలన దక్షతతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని కొనియడరు. ఈ కార్యక్రమంలో గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, చిరుమామిళ్ల సూర్యం, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, బూతిమిల్లిపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు సవలం దినేష్, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, మూల్పూరి సాయి కళ్యాణి, బోడపాటి రవి, గుజ్జర్లపూడి బాబురావు, మేడేపల్లి రమ, బుస్సే నాగప్రసాద్ యనమదల సతీష్, పాలడుగు నాని, అన్నే హరికృష్ణ, పండేటి చిరంజీవి, గొంది నరేంద్ర, జనసేన పార్టీ నాయకులు చిమట రవివర్మ, పచ్చిపాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళాలు వెల్లువ

విశాలాంధ్ర-పమిడిముక్కల: ముళ్ళపూడి లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కోదండరామ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తోట శేషశాయి మానస రూ.50,116లు,లంక హిమ బిందు రూ.25116 లు గంధం అనిల్ కుమార్ దుర్గా భవాని రూ.10116లు గురుకుల వీరేంద్ర రూ.5116 విరాళాలుగా ఇచ్చినట్లు ఆలయ నిర్వహణ కమిటీ తెలిపింది.

దుకాణాల్లో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర, కూచిపూడి : 2026వ సంవత్సరాన్ని స్వాగతం పలికేందుకు మొవ్వమండలంలో కూచిపూడి, పెదపూడి, మొవ్వ, కోసూరు, కాజ, నిడుమోలు ప్రధాన సెంటర్లలోనేకాకుండా మారుమూల పల్లెల్లో సైతం వివిధ రకాల రంగులు, న్యూ ఇయర్ గ్రీటింగ్స్ కేకుల దుకాణాలు, పండ్ల దుకాణాలు, పూలు విక్రయ కేంద్రాలు బుధవారం సందడిగా మారాయి. పెద్ద చిన్న వయస్సుతోతేడా లేకుండా రాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరాన్ని స్వాగతించేందుకు కేక్ కట్ చేసుకుని హ్యాపీ న్యూ ఇయర్ చెప్పుకోవడానికి నిసిద్ధమయ్యారు. అలాగే మహిళలు రకరకాల రంగుల తోముగ్గులుతీర్చిదిద్దుకొని నూతన సంవత్సరాన్ని స్వాగతం పలికేందుకు అర్ధరాత్రి దాకా ముగ్గులు వేసుకున్నారు. అలాగే నూతన సంవత్సరంలో అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలు,పండ్లు కొనుగోలుకు రావడంతో ఆయాదుకాణాలు సందడిగా మారాయి.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలోని జగనన్న కాలనీకి చెందిన అనగాని. గౌతమి(21) అనే యువతి మంగళవారం ప్రమాదవశాత్తు ముదికి కాలువలో పడి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న నవ ఆశయం సత్య గ్రూప్ వ్యవస్థాపకులు దాసి సత్యనారాయణ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10,000 మరియు చిలంకుర్తి. రవి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా తమ సహయ సహకారం అందిస్తానని తెలిపారు. అదేవిధంగా గుడ్లవల్లేరు గ్రామంలోని నీలకంటేశ్వరపురానికి చెందిన భట్టే. ఆంథోనీ బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని కూడా దాసి సత్యనారాయణ పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నవ ఆశయం గ్రూప్ సభ్యులు, చెబత్తిన. నందీశ్వరరావు, పాస్టర్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లికి సన్మానం

విశాలాంధ్ర-కంకిపాడు : నూతనంగా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం అధికార ప్రతినిధిగా ఎన్నికైన రాష్ట్ర దస్తావేజులేఖర్ల సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి హరికృష్ణను జిల్లా అధ్యక్షుడు నూతన ఎన్నికైన వీరంకి గురుమూర్తి కంకిపాడు లోని తుమ్మలపల్లి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వక కలిసి ఘనంగా సన్మానించారు. గురుమూర్తి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమి పార్టీల విధానాలను అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్న రాష్ట్ర అభివృద్ధి నిదాన నినాదాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి వెంట స్థానిక టిడిపి నాయకులుచిట్టూరి నాగేశ్వరరావు వీరంకి శ్యాముతడ కోటేశ్వరరావు షేక్ బాజీ తదితరులు ఉన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన వీరంకి గురుమూర్తిని తుమ్మలపల్లి హరికృష్ణ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

క్రీడాకారులకు షీల్డ్ పంపిణీ

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలం యద్దనపూడిలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మెగా క్రికెట్ పోటీలలో నాల్గవ రోజైనబుధవారం నిర్వహించిన మ్యాచ్.లో మొవ్వ గ్రామానికి చెందిన మొవ్వఏ1స్టార్ టీమ్ 20 బాల్స్ కి 61 కొట్టడంతో టీంకెప్టెన్ హరీషకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కూచిపూడి ఎస్ఐ పి శిరీష షీల్డ్ ను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఇతర వ్యపకాలపైదృష్టి సారించకుండాక్రీడలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొట్టిపాటి సాయి, కమిటీ మెంబర్లు శ్రీకాంత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారునినినితుమ్మలపల్లికి జిల్లా అధ్యక్షుడు సన్మానం విశాలాంధ్ర కంకిపాడు ని డిసెంబర్ 31 ని నూతనంగా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం అధికార ప్రతినిధిగా ఎన్నికైన రాష్ట్ర దస్తావేజులేఖర్ల సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి హరికృష్ణను జిల్లా అధ్యక్షుడు నూతన ఎన్నికైన వీరంకి గురుమూర్తి కంకిపాడు లోని తుమ్మలపల్లి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వక కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమి పార్టీల విధానాలను అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్న రాష్ట్ర అభివృద్ధి నిదాన నినాదాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి వెంట స్థానిక టిడిపి నాయకులుచిట్టూరి నాగేశ్వరరావు వీరంకి శ్యాముతడ కోటేశ్వరరావు షేక్ బాజీ తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన వీరంకి గురుమూర్తిని తుమ్మలపల్లి హరికృష్ణ పార్టీ నాయకులు సన్మానించారు.

91% ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలంలోని 16 సచివాలయాలలో 8362 మందికి 194 మంది ప్రభుత్వ సిబ్బంది ద్వారా బుధవారం 7598మందికి3,60,47,000 రూపాయలకు 3,25,55,000 రూపాయలను ఎన్టీఆర్ భరోసా పెన్షన్లద్వారా లబ్ధిదారులకుపంపిణీచేసినట్లు ఎంపీడీవో డి సుహాసిని వెల్లడించారు లబ్ధిదారులందరికీ ఐరిష్,వేలిముద్రలద్వారా సిబ్బంది పంపిణీ చేశారనిమిగిలినపింఛన్లను జనవరి 2వతేదీ శుక్రవారం పంపిణీ చేస్తారని వివరించారు.

గువ్వల నాగేశ్వర్ రెడ్డి నేత్రదానం

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలం లోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గువ్వల .నాగేశ్వర రెడ్డి (84) బుధవారం ఉదయం అనారోగ్య ము కారణంగా మరణించారు. కుటుంబ సభ్యులను తిరువూరు లైన్స్ క్లబ్ ప్రతినిధి న్యాయవాది గోగిరెడ్డి .కృష్ణా రెడ్డి నేత్ర దానము గురించి వివరించి కుటుంబ సభ్యుల అనుమతి తో మృతుడి నెత్రాలను విజయవాడ యల్ వి .ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్యులు ఉదయం కార్నియ స్వీకరించారు .మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మినుములో యాజమాన్య పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలం భట్లపెనుమర్రులో బుధవారం వ్యవసాయ శాఖ, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో రైతులకు మినుము పంట సాగులో చీడపీడలు మరియు యాజమాన్య పద్ధతుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమం లో రైతులు మినుము మొక్కలు చనిపోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. .నిరిడిమోల్ గోల్డ్ 400 గ్రాములుఎకరానికినేల తడిసేవిధంగాపిచికారి చేయాలని వ్యవసాయ అధికారులుసూచించారు. ఈ కార్యక్రమం లో ఘంటసాల కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి మొవ్వ సబ్-డివిజన్ ఏ.డి.ఏ. సూరపనేనిశ్యామల , మొవ్వ మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సురేష్ బాబు నాయక్, వి ఏ ఏ గా ఉన్న ఏఈఓ ఎం అంజలి మరియు రైతులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-మోపిదేవి : గ్రామపంచాయతీ పరిధిలోని రావివారిపాలెం నవీన్ నగర్ నందు నూతన వితంతు పెన్షన్ ని గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కోనేరు సుందర్ సింగ్ మరియు మోపిదేవి పిఎసిఎస్ అధ్యక్షులు పరుచూరి శ్రీనివాసరావు అందజేశారు. ఇటీవల అనారోగ్యకరణంతో మరణించిన మోపిదేవి రామచంద్రరావు భార్య అన్నపూర్ణ కి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఒక్కరోజు ముందుగానే సచివాలయ సిబ్బంది రవిచంద్ర మరియు కోనేరు సుందర్ సింగ్, పరుచూరి శ్రీనివాసరావు కలిసి బుధవారం ఉదయం అందజేశారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మోపిదేవి : మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనం పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేశామని, త్వరలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామని గ్రామ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు తెలిపారు. నిగ్రామంలో దాతల విరాళాలు రూ.50లక్షలతో నిర్మిస్తున్న జడ్పీ హైస్కూల్ పరిశీలించారు. జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు కేటాయించిన జిల్లా పరిషత్ నిధులు రూ.20లక్షలతో పోతురాజు గుడి నుంచి చెరువు వరకూ నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పరిశీలించారు. నినిఇటీవల కొండముచ్చు దాడిలో గాయపడిన పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కేసాని శ్రీనివాసరావును పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, బొబ్బర్లంక గ్రామ టీడీపీ నాయకులు కోనేరు శివలీల, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కేసాని శివుడు, ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు, కేసాని నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, రామచంద్రరావు, అద్దంకి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మొవ్వ ప్రాంతీయ వైద్యశాలసహాయ సంచాలకులు దివాకర్ కు పదోన్నతి

విశాలాంధ్ర, కూచిపూడి : మచిలీపట్నం డివిజన్లోనిమొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.ఎస్.ఎ దివాకర్ ఉపసంచాలకులు(డిడి) గా పదోన్నతిపై గుంటూరు బదిలీ అయ్యారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితోఆయన బుధవారం మొవ్వ వైద్యశాల నుంచి రిలీవైనారు. మొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాలకుఇన్చార్జిగా నియమించబడిన ఏ డి హెచ్.డాక్టర్ వెంకటరెడ్డి(చల్లపల్లి) కి బాధ్యతలు అప్పగించారు. గుంటూరువెటర్నరీపాలిక్లినిక్ లో గురువారం జాయిన్ అవుతున్నట్లుని బుధవారం దివాకర్ స్థానిక పత్రిక విలేకరులకు తెలిపారు.

ఐడిఏ జిల్లా కార్యదర్శిగా థియఫీలస్

విశాలాంధ్ర ఉయ్యూరు : ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణా జిల్లా శాఖ 2026 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ఎన్నిక ఉయ్యూరు సౌభాగ్య దంత వైద్యశాలలో నిర్వహించడం జరిగింది, అధ్యక్షుడి గా డా. ఆర్. సుధాకర్, కార్యదర్శి గా డా. థియఫిలస్, కోశాధికారి గా డా. శ్రీ రంగం శ్రీనివాస్, ని ఎన్నుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు నవీన్, సురేష్ రెడ్డి, చైతన్య, ఉషా కాంతి, అనూప్, రామకృష్ణ, కాజా, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ 2025 నిర్వహించిన కార్యక్రమాలు మరియు 2026 లో జరగబోయే కార్యక్రమాల వివరాలు తెలియచేసారు. దంతవైద్యం పట్ల ప్రజలలో అవగాహన మరియు జిల్లా వ్యాప్తంగా ఉన్న దంత వైద్యులలో సమన్వయం తీసుకురావటం ఐ.డి.ఏ యొక్క ముఖ్య ఉదేశం అని సభ్యులు తెలియచేసారు. 2025 సంవత్సరంలో సుమారుగా 4 వేల మంది విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించం అని కార్యదర్శి థియఫిలస్ స్థానిక బుట్టాయిపేట లెబనన్ కంటి దంత వైద్యశాలలో జరిగిన సమావేశం లో తెలియచేసారు.

హోటల్లో అగ్నిప్రమాదం - తప్పిన పెను ముప్పు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ వన్‌టౌన్ కెనాల్‌రోడ్డులోని ఆర్కే రివర్ ఫ్రంట్ హోటల్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హోటల్ మొదటి అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ గుణరామ్, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. మొదటి అందస్తులోని మంటలను అదుపులోకి తెచ్చారు. మూడవ అంతస్తులో ఉన్న కేరళకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు యువతులను రక్షించారు. దీంతో పెన ప్రమాదం తప్పింది. ఈ ఘటన పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడలోని విశాలాంధ్ర దినపత్రిక ప్రధాన కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.
-విశాలాంధ్ర-విజయవాడ

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

నూతన సంవత్సర, సీపీఐ శతాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపిన ఎస్.కె నాగుల్ మీరా

విశాలాంధ్ర-తిరువూరు : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా, అలాగే 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.నాగుల్ మీరా నియోజకవర్గంలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతు సంఘాలు, కార్మిక సంఘాలు మరియు అన్ని వర్గాల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ దేశ ప్రజల హక్కుల కోసం, పేదల బతుకుల కోసం, కార్మికుల శ్రమకు గౌరవం కల్పించే పోరాటాల కోసం నిరంతరం ముందుండి నడిచిందని అన్నారు.బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి కార్పొరేట్ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల వరకు సిపిఐ పాత్ర అనన్యసాధారణమని ఆయన గుర్తుచేశారు.దేశంలోని రైతులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ ఎప్పటికప్పుడు గళమెత్తిందని నాగుల్ మీరా పేర్కొన్నారు. భూమి, ఉపాధి, ఆహారం, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక హక్కుల కోసం జరిగిన ప్రతి ఉద్యమంలో సిపిఐ భాగస్వామిగా నిలిచిందని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పార్టీ తన కార్యాచరణను కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.నూతన సంవత్సర సందేశంలో భాగంగా మాట్లాడుతూ, 2026 సంవత్సరం ప్రజా ఉద్యమాలకు మరింత బలం చేకూర్చే సంవత్సరంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కుల హరణ వంటి సమస్యలపై సమిష్టి పోరాటాలు అవసరమని తెలిపారు. ఈ పోరాటాల్లో సిపిఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.రైతు వ్యతిరేక విధానాలు, కార్మిక వ్యతిరేక చట్టాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. చివరిగా ఆయన మాట్లాడుతూ, 2026 నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆరోగ్యం, ఐక్యత, పోరాట విజయాలు తీసుకురావాలని కోరారు. అలాగే సిపిఐ శతాబ్ది సంవత్సరం ప్రజా ఉద్యమాల చరిత్రలో మరొక కీలక అధ్యాయంగా నిలవాలని ఆకాంక్షించారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు పార్టీ శతాబ్ది సంవత్సరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.

సమిష్టి కృషితో విజయాలు

-కొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరంలోకి అడుగులు

-అందరి సహకారంతో 2026లోనూ జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం

-18.5 శాతం వార్షిక వృద్ధికి సమష్టిగా కృషిచేస్తున్నాం

-సీఎం దిశానిర్దేశంతో ఆధునిక సాంకేతిక, రియల్ టైమ్ గవర్నెన్స్తో అనుసంధానం

-జిల్లా ప్రజలకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విజయవాడ: ఏడాది కాలంలో మీడియాతో సహా వివిధ భాగస్వామ్య పక్షాలు, అధికారులు, గౌరవ ప్రజాప్రతినిధుల సహకారంతో సమష్టి కృషితో ఎన్నో విజయాలు సాధించామని జిల్లా అభివృద్ధి దిశగా కొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరంలోకి అడుగులు వేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సమగ్రాభివృద్ధికి దారితీసే ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సహకారంతో 2026లోనూ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తామన్నారు.నిబుధవారం విజయవాడ గురునానక్ కాలనీ రోడ్డు శుభలగ్న వేదిక ఫంక్షన్ హాల్లో మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లోనూ 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యంగా పటిష్ట ప్రణాళికలు అమలుచేస్తున్నామన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 315 కీలక ప్రగతి సూచిక (కేపీఐ)ల్లో 83 స్కోరుతో రాష్ట్రంలోనే నెం.1గా జిల్లా నిలిచిందని.. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తూ ప్రతి సూచికలోనూ ముందంజలో నిలిచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 2023-24లో తలసరి ఆదాయం రూ. 3,21,651 కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ. 4,17,412 అని, లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి దిశగా పయనిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.నిప్రతి నియోజకవర్గానికి దార్శనిక ప్రణాళికలు:నిగౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రతి నియోజకవర్గ అభివృద్ధిపై దార్శనిక ప్రణాళికలతో ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని.. స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎ.కొండూరుకు అదనపు డయాలసిస్ కేంద్రం రావడాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చన్నారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ఉపాధి కల్పనకు, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే విధంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. నిర్మాణాత్మక సద్విమర్శలను స్వీకరించి లోటుపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాకుండా అన్నింటా ఈజ్ ఆఫ్ డూయింగ్తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్కు ప్రాధాన్యమిస్తూ సత్వర ప్రగతికి టీమ్ ఎన్టీఆర్ కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామికరంగాలతో పోల్చితే జిల్లాలో సేవారంగం అధిక శాతం వాటా (దాదాపు 67 శాతం) కలిగి ఉందని.. ఈ రంగంలో మరింత అభివృద్ధికి ఆస్కారముందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాను టూరిజం హబ్గా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆంధ్రా ట్యాక్సీ యాప్తో పాటు ప్రత్యేక టూరిజం ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఆధునిక సాంకేతికత, డేటా లేక్ సహాయంతో ముందుకెళ్తున్నామన్నారు. మొంథా తుపాను సమయంలో డేటా అనలిటిక్స్ సహాయంతో తీసుకున్న చర్యలు మంచి ఫలితాలిచ్చాయన్నారు. పరిపాలనలోనూ రియల్టైమ్ గవర్నెన్స్, డేటా బ్యాంకు సహకారంతో ఐవీఆర్ఎస్ ఫీడ్బ్యాక్ ఆధారంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ అంటే కేవలం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కేంద్రం మాత్రమే కాదని.. అమరావతి ప్రాంతానికి గేట్ వే అని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, మీడియా సహకారంతో ముందుకెళ్తామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.నికార్యక్రమంలో డీఐపీఆర్వో కేవీ రమణరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో విజువల్ సూపర్వైజర్ వీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై చోరీ కేసులో అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఇంద్రకీలాద్రి పై చోరీ కేసులో అంతరాష్ట్ర దొంగను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని నుంచి రూ.25లక్షల విలువైన 180 గ్రాముల బంగారం అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విజయవాడ వన్‌టౌన్‌లోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏడీసీపీ రాజారావు కేసు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ నెలలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై పార్కింగ్‌లో ఉన్న కారు డోర్ తెరిచి బంగారు అభరణాల కలిగిన బ్యాగ్‌ను చోరీకి గురైంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగలమూరు గ్రామానికి చెందిన గణేష్‌ను అందుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 180గ్రాముల బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గణేష్ కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ వచ్చే ఆదాయం సరిపోక, చెడు వ్యాసనాలకు అలవాటుపడ్డారు. దేవాలయాల్లో పార్కింగ్‌లో ఉన్న కారు నుంచి బ్యాగ్‌లు దొంగలించేవాడు. ఈక్రమంలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై పార్కింగ్‌లో ఉన్న కారు నుంచి బ్యాగ్ దొంగలించాడు. అంతజిల్లా నేరస్తుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన డీసీపీ తిరుమల్లేశ్వరరెడ్డి, క్రైమ్ ఏడీసీపీ రాజారావు, ఏసీపీ సిహెచ్. వెంకటేశ్వర్లు, సీఐ రామ్ కుమార్, వారి సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు అభినందలు తెలియజేశారు.

అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ : ఎంపీ కేశినేని చిన్ని

విశాలాంధ్ర-నందిగామ:-2025 శ్రుతులను మరచి 26లోకి ఉత్సాహంగా మరింత అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ నడవాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు బుధవారం స్థానిక శాసనసభ్యులు కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా నూతన అధ్యక్షురాలు గద్దె అనురాధ,స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తో కలిసి కేక్ కట్ చేసి 2026 నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సంస్కరణలను ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడిన సంఘటనను గుర్తు చేసుకున్నారు వారి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దినదిన అభివృద్ధిగా జరుగుతుందని పేర్కొన్నారు నందిగామ నియోజకవర్గ ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలియజేశారు ఈ వేడుకల్లో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రమణ్యం (బోస్), రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల సంఘం ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు), మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర డైరెక్టర్లు ప్రాథమిక వ్యవసాయ పరిమితి సంఘం చైర్మన్లు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంతరం మండల పరిధిలోని మునగచర్ల గ్రామంలో ఇంటింటికి సామాజిక భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు అనంతరం కోటి 15 లక్షల రూపాయలతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మునగచర్ల టిడిపి నాయకులు ఓటమి నాయకులు కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు.

ఏపిఎఫ్‌సిసిఐ ద్వారా ఏపీ ట్రేడ్ హబ్‌ను ఏర్పాటు చేస్తాం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : నూతన రాష్టాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజధాని అమరావతి నిర్మాణానికి అన్ని విధములుగా సహాయం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి 2025 సంవత్సరంలో ప్రభుత్వం వ్యాపారస్తులకు అనేక ప్రయోజనకర సంస్కరణలు తీసుకొచ్చి వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తునందుకు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తరపున అభినందనలు తెలుపుతున్నామని అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కర్ రావు తెలిపారు. బుధవారం ఏపి జీఎస్టీ ఛీఫ్ కమీషనర్ బాబు ఎ ను కలసి పలు విషయాలపై చర్చించటంతో పాటు 2026 నూతన ఏడాది డైరీని అందజేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొత్త జీఎస్టీ స్లాబ్‌లు అయిన 5%, 18%,కు నిత్యవసర వస్తువులు,అనేక ఎఫ్ఎంసీజీ వస్తువులు ఐదు శాతం జీఎస్టీకి మార్చారు. ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా సూక్ష్మ చిన్న వ్యాపారులకు పది లక్షల వరకు పూచికత్వం లేని రుణాలు మంజూరు చేస్తున్నారన్నారు.ల్యాండ్ కొనుగోలు లీజ్,తనఖా సుంకాలపై స్టాంపు డ్యూటీ 100% రియంబర్స్‌మెంట్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో మార్పులు చేస్తున్నారన్నారు.ఆంధ్రప్రదేశ్లో సంపద సృష్టించాలంటే వ్యాపార వాణిజ్య వర్తకం అభివృద్ధి చెందాలన్నారు. వ్యాపార వాణిజ్య వర్తక అభివృద్ధి చెందాలంటే ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి ముఖ్యమైన నగరాలలో (విజయవాడ, తిరుపతి) వంటి ప్రాంతాలలో స్థలం కేటాయిస్తే ఏపీ ట్రేడ్ హబ్ ను ఏర్పాటు చేస్తామన్నారు.ఈ ట్రేడ్ హబ్ ద్వారా అన్ని రకముల వస్తువులు ఒకచోట దొరుకుతాయి, వస్తు తయారీ, ఎగుమతులు, దిగుమతులు వాణిజ్యం, వర్తకం అన్ని ట్రేడ్ హబ్ లోనే జరుగటం ద్వారా సంపద, అటు రాష్ట్రానికి ఆదాయం దొరుకుతుంది. అంతేకాకుండా ఎంతోమందికి ఉద్యోగాలు లభించటం కార్మికులకు ఉపాధి కలుగుతుందన్నారు. మనమే సంపద సృష్టించవచ్చును. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కూడా భాగస్వాములై కృషి చేస్తాము అని తెలిపారు.

గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మెకు ఐఎఫ్‌టియు మద్దతు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈరోజు (డిసెంబర్ 31) గిగ్ డెలివరీ కార్మికులు ఒకరోజు సమ్మె నిర్వహిస్తున్నారు.వేతన చెల్లింపుల్లో పారదర్శకత, కార్మికుల ఐడీలను అకారణంగా బ్లాక్ చేయడాన్ని నిరసిస్తూ,కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారిన '10 నిమిషాల డెలివరీ' టైమ్ మోడల్‌ను నిషేధించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ పోరాటానికి ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టియు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తన పూర్తి మద్దతును ప్రకటిస్తోందని రాష్ట్ర అధ్యక్షులు కె.పోలారి ఒక ప్రకటనలో తెలి4 లేబర్ కోడ్‌లు (కార్మిక చట్టాలు) గిగ్ వర్కర్లకు ఎంతో మేలు చేస్తాయని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెబుతోంది.కానీ వాస్తవానికి, ఈ కోడ్‌లు గిగ్ వర్కర్లను "యజమాని-ఉద్యోగి సంబంధం" పరిధిలోకి రాని వారిగా వర్గీకరిస్తున్నది. వారిని అసలు 'కార్మికులు' అనే నిర్వచనం నుండే బయటకు నెట్టివేస్తున్నాయి. డెలివరీ కార్మికులు చేస్తున్న డిమాండ్లను బట్టి చూస్తే, వారు యజమానులతో స్పష్టమైన పని సంబంధాన్ని కలిగి ఉన్నారని అర్థమవుతోంది. కేంద్ర ప్రభుత్వం కేవలం మాటలతో సరిపెట్టకుండా, డెలివరీ కార్మికుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించిన ఈ విధానాలను తక్షణమే ఉపహరించుకునేలా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. కానీ అమలు చేయక పోగా కార్మికుల పోరాటాల ఒత్తిడి లేకుండా ప్రభుత్వ యంత్రాంగం కదలడం లేదు. ఒకవేళ కొత్త లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే, ఈ యంత్రాంగం కేవలం "సహాయకారి" గా మారిపోతుంది తప్ప, చట్టాలను అమలు చేసే హక్కును కోల్పోతుంది. ఈ లక్ష్యం కోసం దేశవ్యాప్తంగా ప్రతి వారం నిరసన కార్యక్రమాలను ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ పిలుపును రాష్ట్రంలో కూడా అమలు చేయాలి.గిగ్ రవాణా కార్మికులు,ఇతర విభాగాల గిగ్ వర్కర్లందరూ ఈ పోరాటాలలో చేరాలని తాము కోరుతున్నాము. కార్మికులుగా తమ చట్టపరమైన హక్కులను కాపాడుకోవడానికి ఇది ఎంతో అవసరం అన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారి షేక్ టిప్పు సుల్తాన్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారం.ఓ.లు, ఇతర సరైన రికార్డులు నిర్వహించని పలు దుకాణాల్లో ఉన్న రూ.1,69,260ల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయాలు జరిపితే, కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం 250 మెట్రిక్ టన్నుల యూరియా విస్సన్నపేట మండలంలో విక్రయానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

బీమా రంగంలో గణనీయమైన మార్పులు

-2025 లో వృద్ధి సాధించిన జీవిత బీమా

-బీమా అవగాహనా కమిటీ (ఐపసి లైఫ్) చైర్ పర్సన్ కమలేష్ రావు

విశాలాంధ్ర-విజయవాడ: - భీమా రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, మరి ముఖ్యంగా జీవిత బీమా లో పెను మార్పులకు నాంది పలికిందని బీమా అవగాహనా కమిటీ (ఐపసి లైఫ్) చైర్ పర్సన్ కమలేష్ రావు అన్నారు. 2025 సంవత్సరం ముగింపు సందర్భంగా జీవిత బీమా నివేదిక వివరాలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ 2025 సంవత్సరం కొన్ని గీటురాయి కస్టమర్ కేంద్రిత చొరవ కార్యక్రమాలను చవి చూసిందన్నారు. జీవిత బీమా సార్వత్రిక సామాజిక సంక్షేమ మద్దతును అందించడంలో అవి కేంద్రీయ కార్యక్రమంగా చేయడంలో ఎంతో దూరం వెళతాయన్నారు. సరెండర్ విలువ నియమనిబంధనలలో మార్పుతో ఈ సంవత్సరం మొదలయింది మరియు జీఎస్టీ మినహాయింపు మరియు బీమా సుగమ్ పోర్టల్ ఆవిష్కరణతో అది తన అభివృద్ధి మార్గాన్ని కొనసాగించిందన్నారు. ప్రస్తుతం, జీవిత బీమాకు డిమాండ్ అనేది ప్రధానంగా రక్షణ, ఆన్యుయిటీలు మరియు పొదుపు ఉత్పాదనల వ్యాప్తంగా విస్తరించి ఉందని, ఇంకా మరిన్ని ఎక్కువ కుటుంబాలు రక్షణ మరియు రిటైర్‌మెంట్ పరిష్కారాలకు ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా, ఈ ఉత్పాదనలు ఆర్థిక భద్రతను అందిస్తూ ఉండటాన్ని మనం చూస్తూనే ఉంటామన్నారు. ఈ పర్యవసాన ఫలితంగా, బీమా సంస్థలు మెరుగైన ఇంకా మరింత ఘనమైన ఉత్పాదనలను అందించే ఆవిష్కరణలను 2026 సంవత్సరం చవి చూడవచ్చు అన్నారు.

ఎఫ్‌డిఐ నియమ నిబంధనల సడలింపు అనంతరం రాబోయే ఏడాది మరిన్ని అంతర్జాతీయ అగ్రగామి సంస్థలు మార్కెట్లోకి ప్రవేశించడాన్ని చూడవచ్చు అని చెప్పారు. మార్కెట్లో మరిన్ని అగ్రగామి సంస్థలు ప్రవేశించడం వల్ల బీమా రంగం ఆ ఉత్తేజాన్ని సద్వినియోగం చేసుకొని జీవిత బీమా పరిష్కారాలను మరింత సమర్థవంతంగా అందించడానికి వీలు కలుగుతుందన్నారు. సానుకూలమైన నిబంధనాయుత వాతావరణం, డిజిటల్ టెక్నాలజీలో పురోగతి, ఇంకా పెరిగిన వినియోగదారుల అవగాహన 2026 సంవత్సరంలో జీవిత బీమాలో సుస్థిరమైన మరియు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు వీలు కల్పిస్తాయని చెప్పారు.

ఆరోగ్య ఆంధ్ర సాకారానికి కలిసికట్టుగా అడుగులేయాలి

విశాలాంధ్ర -విజయవాడ: ప్రాచీన వైద్య విధానం మన దేశ వారసత్వ సంపద అని.. ఆయుర్వేదం, యోగా, ప్రకృతివైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి (ఆయుష్)పై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించి, ప్రభుత్వాల చొరవ, ఏర్పాట్లను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు.నిబుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్ను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్కు వివిధ పనులపై వచ్చే సందర్శకులకు వైద్యాధికారులు ఆయుష్ విశిష్టతపై అవగాహన కల్పించారు. కొందరిని పరీక్షించి, ఔషధాలు అందించారు. కలెక్టర్ లక్ష్మీశ ఇగ్నైట్ సెల్ను సందర్శించి ఆయుష్ వైద్యులకు వివిధ సూచనలు చేశారు. జిల్లాలో ఏడు ఆయుష్మాన్ మందిర్లు, ఆరు ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయని.. అదేవిధంగా విజయవాడలో డా. ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, డా. నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఉన్నాయని, వీటిద్వారా మెరుగైన సేవలు అందించేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047ను ఆవిష్కరించడం జరిగిందని.. ఆరోగ్య ఆంధ్ర సాధనలో ఆయుష్ విభాగం కూడా కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. నికార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, డా. విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పథకం పట్టణం, మండల గ్రామాల్లో ముందస్తుగా పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-తిరువూరు: పట్టణం,మండలంలోని గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి 2026 నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పెన్షన్లను డిసెంబర్ 31వ తేదీననే లబ్ధిదారులకు అందజేశారు. జనవరి 1వ తేదీన నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని పెన్షన్ల పంపిణీని ఒక రోజు ముందుగానే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఆ మేరకు 31.12.2025 న ఉదయం 6.30 గంటల నుంచే తిరువూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పెన్షన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.పట్టణంతో పాటు లక్ష్మీపురం, కాకర్ల, ఆంజనేయపురం, చిట్యాల, మల్లాల, వావిలాల, మునుకుళ్ళ, రాజుగూడెం, పెద్దవరం, కోకిలంపాడు, పోలిశెట్టిపాడు, జీలకుంట, ముష్టికుంట్ల, గానుగపాడు, చౌటపల్లి, కొత్తూరు తదితర పరిసర గ్రామాల్లో పెన్షన్ లబ్ధిదారులు ఉదయం నుంచే తమ తమ గ్రామ సచివాలయాలకు హాజరై గ్రామ సచివాలయ సిబ్బంది సంబంధిత పిడిఓల ద్వారా పెన్షన్ నగదును స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పెన్షన్ పంపిణీ సక్రమంగా నిర్వహించారని పేర్కొన్నారు. ముందుగానే పెన్షన్ నగదు అందడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేసినట్లు సమాచారం.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి నెలకు సంబంధించిన పెన్షన్లను డిసెంబర్ 31వ తేదీననే పంపిణీ చేయడం జరిగిందని అలాగే పింఛన్దారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామ గ్రామాలు తిరిగి అందరితో మన్నలు పొందారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు కొనసాగుతాయని చెప్పారు.

ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటివద్దనే ఫించను పంపిణీ

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఫించను దారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటివద్దనే ఫించను పంపిణీ చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. స్థానిక మిథిలా నగర్, విద్యాదరపురం పరిసర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించి ఫించను లబ్దిదారులకు ఫించను పంపిణీ చేశారు. ఫించను లబ్దిదారుల ఆధార్ కార్డును ఫేస్ రికగ్నిషన్ విదానం ద్వారా చెక్‌చేసి పింఛను డబ్బులు అందజేశారు. అనంతరం లబ్దిదారులతో మాట్లాడి వారికి ఉన్న సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా పింఛను పంపిణీ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ఈనెల ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటల కల్లా పింఛను పంపిణీని మొదలు పెట్టి లబ్దిదారులకు ఇంటి వద్దనే అందజేస్తున్నట్లు తెలిపారు. సర్కిల్-1 పరిదిలో 18,476 పెన్షన్లు, సర్కిల్-2 పరిదిలో 23,396, సర్కిల్-3 పరిదిలో 18,268 ఉన్నాయని, వారందరికీ సిబ్బంది సకాలంలో పెన్షన్ పంపిణీ చేసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది, సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రంగనాయకులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనా యకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక 58వ డివిజన్‌లో బుధవారం జరిగిన కార్మిర్ మీటింగ్‌లో రంగనాయకులు, విజయవాడ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశం మేరకు పారిశుధ్య కార్మికులకు రూ.వేలకు తగ్గకుండా వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ పాలకులు న్యాయస్థానం ఆదేశాలు పాటించకుండా చాలీచాలని వేతనాలు ఇస్తూ వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారని అన్నారు. వేతనాలపై ఆదారపడి జీవిస్తున్న కార్మికులు వచ్చే వేతనాలతో ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యావసరాలకు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బుద్దె రాజా మాట్లాడుతూ పని చేసేచోట సరిపడ కార్మికులు లేక ఉన్నా కార్మికులతోనే వెట్టి చాకిరీ చేయిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. పెరిగిన జనాబాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి, కనీసీ వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు జక్కి జేమ్స్, కోశాదికారి తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నటుడు శివాజీ వ్యాఖ్యలు మహిళా లోకానికి అవమానం : లంకా గోవిందరాజులు ఆగ్రహం

విశాలాంధ్ర - విజయవాడ: సినిమా ప్రమోషన్ల పేరుతో పబ్లిసిటీ కోసం మహిళలను కించపరుస్తూ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా గోవిందరాజులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ, సెలబ్రిటీ హోదాలో ఉండి సమాజానికి ఆదర్శంగా ఉండాల్సింది పోయి, మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడటం ఆయన సంస్కారహీనతకు నిదర్శనమని మండిపడ్డారు.పబ్లిసిటీ కోసం దిగజారుడు రాజకీయం, సినిమా హిట్ అవ్వడం కోసం లేదా వార్తల్లో నిలవడం కోసం మహిళల మనోభావాలను దెబ్బతీయడం ఫ్యాషన్ అయిపోయిందని, ఇలాంటి వెకిలి చేష్టలను ఏఐవైఎఫ్ సహించబోదని హెచ్చరించారు. మైకు దొరికింది కదా అని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదని, తక్షణమే శివాజీ మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.నిసెన్సార్ బోర్డు , మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ స్పందించాలని బాధ్యతారాహిత్యంగా మాట్లాడే నటులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూల పేరుతో అసభ్యతను ప్రచారం చేసే యూట్యూబ్ ఛానెళ్లపై కూడా నిఘా ఉంచాలన్నారు.నిమహిళలను గౌరవించడం మన సంస్కృతి, ఒక పక్క మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోపక్క ఇలాంటి బాధ్యతలేని వ్యాఖ్యలు చేయడం వల్ల సమాజానికి తప్పుడు సందేశం వెళ్తుందని లంకా గోవిందరాజులు అన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో అపస్మృతులు లేకుండా పటిష్ట చర్యలు : సీఐ

విశాలాంధ్ర -కంచికచర్ల : నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అపస్మృతులు లేకుండా చూసేందుకు గ్రామీణ సిఐ డి చవాన్ ఆధ్వర్యంలో పోలీసులు అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టారు. సురక్షితమైన నూతన సంవత్సర వేడుకల కోసం రూరల్ సర్కిల్ పరిధిలో పోలీస్లు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ముందస్తుగా ప్రజలకు పలు సూచనలు చేశారు. బుధవారం రాత్రికే ప్రధాన రహదారిలో పోలీసులు గస్తీ ప్రారంభించారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా అందరూ సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగానే విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ప్రధాన రహదారులలో పోలీసు గస్తీని ముమ్మరం చేశారు.రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై దృష్టి సారించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల జప్తు తో పాటు కఠినమైన చర్యలు తీసుకోబడతాయని ఇప్పటికే హెచ్చరించారు.నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలు వాడినా, సరఫరా చేసినా కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సిఐ చవాన్అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ కరణం వెంకట సుబ్బారావు, నివాసం: డోర్ నెం. 2-77/2, ఈలప్రోలు గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం నివాసి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది... నా క్లయింట్ ది.10-03-1993న అక్కల జయలక్ష్మి మరియు వారి కుమారుల వద్ద క్రయం పొందిన స్థలం యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్ నెం.335/1993 లోను నిమిత్తం సూర్యారావుపేట లోని సివిల్ కోర్టుకు బ్యాంకు ప్లీడరు గారి వద్దకు వెళ్ళి అన్ని డాక్యుమెంట్లు ఫోటోస్టాట్ తీయించినారు. తరువాత పై డాక్యుమెంట్ ఒరిజనల్ పోయినదని, చుట్టు ప్రక్కల విచారించి, ఎంత వెదికిననూ దొరకలేదు. కావున సదరు ఒరిజనల్ దస్తావేజు నెం.335/1993 ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు గానీ, నా క్లయింట్ అడ్రస్సుకు గానీ అందజేసిన యెడల తగిన పారితోషికం ఇవ్వబడును.

తిరుమాని శ్రీనివాసరావు, న్యాయవాది
శ్రీరామ్‌నగర్, విజయవాడ - 10
సెల్: 9885614810

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ముప్పాళ్ళ, జంగాల, కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : సీపీఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2026 నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో పార్టీ సభ్యుల ఆత్మీయ సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా హాజరైన సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని విస్తృత ప్రజా ఉద్యమాలు చేపట్టాలని, కింది స్థాయి నుంచి పార్టీని, ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేసుకుంటూ పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరైన సభ్యులు 2025 సంవత్సరంలో వారు నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. పార్టీని ఏ విధంగా బలోపేతం చేద్దాం అనే అంశాలపై చర్చించారు.

'సర్' పై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలి

ఫాసిజం అంటే ఏమిటి ? ఫాసిజాన్ని ఎలా ఎదుర్కోవాలి పుస్తకం ఆవిష్కరణ సభలో పరకాల ప్రభాకర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఎన్నికల కమీషన్ తీసుకొచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలని ప్రముఖ ఆర్థికవేత్త, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. గుంటూరు సీపీఎం కార్యాలయంలో మంగళవారం రమేష్ పట్నాయక్ రచించిన ఫాసిజం అంటే ఎమిటీ? ఫాసిజం ఎలా ఎదుర్కోవాలి? పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ప్రోగ్రెసివ్ ఫోరమ్ అధ్యక్షుడు ఎస్ హనుమంత రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పరకాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సర్‌లో చాల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే కీలకమని, వారి ఓటు హక్కును హరించివేయడం అన్యాయమన్నారు. మేధావులు, విశ్లేషకులు ఏకతాటిపైకి వచ్చి సర్‌పై వ్యతిరేఖంగా గళం వినిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఈ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఫాసిజాన్ని ఎదుర్కోకోకపోతే వచ్చే ప్రమాదాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సైన్సెస్ ట్రస్ట్ సభ్యులు ఏ జగన్నాథరావు, సాహితి వేత్తలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీటెక్ చదివాడు... బెట్టింగులకు బానిసై...

పలు దొంగతనాల్లో నిందితుడిగా మారాడు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : బీటెక్ చదువుకుని, బెట్టింగులకు బానిసై, వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను కొల్లిపర పోలీసులు అరెస్ట్ చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో అరెస్ట్ గురించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. కొల్లిపర పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్నంగి గ్రామానికి చెందిన మర్రి శివగోపి ఈ నెల 19వ తేదీన ఉదయం తన ఇంటికి తాళం వేసి, తాళం చెవిని ముగ్గు గిన్నెలో పెట్టి పొలం పనికి వెళ్లి, మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపుకు వేసిన తాళం తీసి ఉండటం, ఇంటి లోపలకి వెళ్ళి చూడగా బీరువా కూడా తెరిచి అందులో ఉన్న రూ.2.35 లక్షల విలువ గల 60 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5 వేలు నగదును దొంగిలించుకుని పోయారని గ్రహించి, అదే రోజు కొల్లిపర ఎస్సై ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తెనాలి డీఎస్పీ జనార్దన్ పర్యవేక్షణలో తెనాలి రూరల్ సీఐ ఎస్‌కే నాయబ్ రసూల్ దిశా నిర్దేశంలో కొల్లిపర ఎస్సై సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సమగ్ర దర్యాప్తు చేపట్టారన్నారు. ముసుగుతో ఉన్న ఒక వ్యక్తి అనుమానాస్పదంగా బైకుపై తిరగడాన్ని సీసీ కెమెరాలు ద్వారా గమనించి, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వివరాలను తెలుసుకుని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం, భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున రెడ్డిగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించడం జరిగిందన్నారు. ఈ విచారణలో మున్నంగిలో జరిగిన దొంగతనాన్ని తానే చేసినట్లు అంగీకరించి, దీనితో పాటు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు, మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చేసినట్లు చెప్పడం జరిగిందన్నారు. నిందితుడు బీటెక్ పూర్తి చేసి 2024వ సంవత్సరం నుంచి ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి, బెట్టింగ్ ఆడడానికి డబ్బులు లేక తెలిసిన వారి వద్ద అప్పు చేసి వాటిని కూడా బెట్టింగ్‌లో పోగొట్టుకొని, అప్పుగా కూడా డబ్బులు దొరక్కపోయేసరికి ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే కోరికతో దొంగతనాలు చేయాలని నిశ్చయించుకోవడం జరిగిందని వివరించారు. ఆ క్రమంలో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుడిపై తెలంగాణ రాష్టంలోని హుజూర్ నగర్, చింతకాని, అనంతగిరి పోలీస్ స్టేషన్‌లలో మూడు దొంగతనం కేసులు నమోదు అయ్యాయని, హుజూర్ నగర్ కేసులో జైలుకి వెళ్ళి రావడం జరిగిందని తెలిపారు. నాలుగు వరుస దొంగతనాల కేసుల్లో రూ.16 లక్షలు విలువైన 96 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.5 వేల చోరీ సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసులను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

డీ-అడిక్షన్ సెంటర్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్న ఈగల్ చీఫ్ రవికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా మంగళగిరిలోని డీ-అడిక్షన్ సెంటర్‌లో ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే రవికృష్ణ నూతన సంవత్సర వేడుకలను బుధవారం జరుపుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ డి అడిక్షన్ సెంటర్‌లో మత్తు చెర నుంచి బయటపడటానికి చికిత్స పొందుతున్న మైనర్ బాలుడుతో కలిసి కేక్ కట్ చేశారు. నూతన వస్త్రాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మత్తుకు బానిసైన వారు ఈ నూతన సంవత్సరాన్ని జీవితంలో కొత్త మార్గం ప్రారంభించే అవకాశంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. డి అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యుల నుంచి తెలుసుకుని, చికిత్స విధానాలు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన వైద్య చర్యలపై సమగ్రంగా చర్చించారు. అనంతర కార్యాచరణలో భాగంగా విద్యనభ్యసించడంలో తమదైన సహాయం చేస్తామని ఐజీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, సైకియాట్రీ విభాగం ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఓడీ టీవీ పవన్ కుమార్, ఈగల్ డీఎస్పీ సిగ్గయ్య, గుంటూరు ఈగల్ సీఐ విక్టర్, ఎసై సునీల్ బాబు, సీనియర్ రెసిడెంట్ వై.సాయి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీల పేలుళ్లపై గొల్లపాలెం గ్రామ ప్రజలు ధర్నా

విశాలాంధ్ర-ఫిరంగిపురం : గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండల కేంద్రంలోని ఫిరంగిపురం కొండ క్వారీల్లో బ్లాస్టింగ్ పేలుళ్ల నుంచి తమను కాపాడి న్యాయం చేయాలంటూ గొల్లపాలెం గ్రామ ప్రజలు బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫిరంగిపురం కొండ క్వారీల పక్కనే ఉన్న తమ ఇళ్ళపై గ్రానైట్ క్వారీల నుంచి బ్లాస్టింగ్ పేలుళ్ళతో ఇళ్ళపై రాళ్లు పడి ఇళు ళ్ళు ధ్వంసమై దుమ్ము దూళితో అనారోగ్యాల పాలై ఇబ్బందులు పడుతుంటే ఇంతవరకు అధికారులు ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహావేశాలతో రెవిన్యూ అధికారులపై ధ్వజమెత్తారు. వెంటనే క్వారీలను మూసి వేయించి తమకు న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ జె.ప్రసాదరావు తొల్లపాలెం గ్రామానికి వెళ్ళి క్వారీలను పరిశీలించి క్వారీ యజమానులకు నోటీసులు జారీ చేశామని, గ్రామ ప్రజలు భయపడాల్సిన పనిలేదని తెలియజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కార మార్గానికి కృషి చేస్తానని తహశీల్దార్ చెప్పారు.

సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు

విశాలాంధ్ర, తెనాలి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్న ఇప్పటి వరకు నూతన ఫించన్లను ఇవ్వలేదని, కనీసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ కూడా పనిచేయడం లేదని, కొత్త ఫించన్లు ఇప్పించమని వృద్ధులు, వికలాంగులు తమ వద్ద ఏకరువు పెడుతున్నారంటూ వైఎస్సార్ సిపి కౌన్సిలర్ ఆవుల కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం జరిగింది. ఈసమావేశానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. తమ ప్రభుత్వంలో నూతన ఫించన్లు ఇచ్చామని టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి వైఎస్సార్ సిపి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దీంతో వైసిపి టిడిపి కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు మొదలై సమావేశం గందరగోళంగా మారింది. ఛైరపర్సన్ రాధిక అందరిని శాంతింపజేసి ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని సూచించారు. ఎవరూ వినకపోవడంతో సమావేశం 5ని॥ వాయిదా వేశారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశానవాటికలను వారినికి ఒకసారి బాగుచేయించాలని వైసిపి కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్ కోరారు. సిబ్బంది కొరత ఉందని, నూతన కార్మికులను తీసుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, అది పూర్తికాగానే బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారి డా.మొవ్వా యేసుబాబు తెలిపారు. పట్టణంలో అనధికార కట్టడాలు, ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు ఏసిపి వాణిలు సమన్వయ లోపం వలన కొన్ని ఇబ్బందులు వచ్చినమాట వాస్తవమని, టౌన్ ప్లానింగ్‌లో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో కుక్కల సమస్య అధికంగా ఉందని, పారిశుద్ధ్య నిర్వహణ పడకేసిందని, వార్డుల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని వైస్ ఛైర్‌పర్సన్ అత్తోట నాగమణి, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, మట్లపూడి సంధ్యారాణి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, మల్లిబోయిన సువర్ణరేఖాదేవిలు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కళామతల్లి కంఠాభరణం కొంగర జగ్గయ్య

విశాలాంధ్ర-తెనాలి : విలక్షణ నటులు కొంగర జగ్గయ్య తెలుగు నాటక రంగంలో రాజకీయ రంగంలో పేరు ప్రఖ్యాతలు సముపార్జించిన బహుముఖ ప్రతిభాశాలి అని వక్తలు కొనియాడారు. తెనాలి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయం అభ్యుదయ సమితి తెనాలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శతజయంతి సభ జరిగింది. సభకు వర్థమాన సినీనటులు, ఇస్కఫ్ నాయకులు వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగు నాటక రంగాల్లో, సినిమాల్లో కొంగర జగ్గయ్య నటన ఉన్నత స్థాయికి ఎదిగిందని చెప్పారు. పాత్రికేయునిగా, రచయితగా, నటుడిగా రాజకీయవేత్తగా ప్రజల హృదయాల్లో నేటికి మెదులుతున్నారని అన్నారు. ఆయన శతజయంతి కార్యక్రమాలను సినీరంగంలోని నటులు, రాజకీయ నాయకులు నిర్వహించాలన్నారు. తెనాలి ప్రాంతంలోని నేటి దుగ్గిరాల మండలం మోరంపూడిలో కొంగర సీతారామయ్యకు జన్మించారని చెప్పారు. సినీరంగంలో నటుడు శ్రీధర్, సంగీత దర్శకులు కోదండపాణిలతో పాటు అనేక నటీనటులను సినీ పరిశ్రమకు పరిచయం చేశారని అన్నారు. దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రజల్లో సాంఘిక చైతన్యం తీసుకువచ్చేందుకు నిరంతరం కృషి చేశారన్నారు. పౌరాణిక జానపద గాదలను చిత్రాలుగా రూపొందించినప్పటికీ జాతీయ జీవితంలో ఏర్పడిన పరిణామంకు ద్వారనలకు ప్రతిబింబాలైన చిత్రాలను నిర్మించాలని దర్శక నిర్మాతలకు తెలియజేసిన ఘనత జగ్గయ్యకు చెందుతుందని చెప్పారు. అంచలంచెలుగా పార్లమెంట్ సభ్యులు స్థాయికి ఎదిగి పార్లమెంట్‌లో తన గళాన్ని వెలుగెత్తి చాటారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి విజయవాడ నాయకులు రంగారావు జగ్గయ్య జీవిత విశేషాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయవేత్తగా సినిమాల్లో నటిస్తూనే ప్రజా సేవ చేసిన ఘనత జగ్గయ్యకే దక్కుతుందన్నారు. గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ మాస్టారు మాట్లాడుతూ జగ్గయ్యతో గత సాన్నిహిత్యాన్ని తెలియజేస్తూ పేద సాధలకు పేద విద్యార్థులకు జీవితాంతం ఆర్థిక సహాయం చేస్తూనే వచ్చారన్నారు. చిత్ర సీమలో ఫిలిమ్స్ యూనియన్ల ద్వారా సినీ కార్మికులకు అండదండలుగా నిలిచారన్నారు. సభా కార్యక్రమానికి ప్రారంభంలో జగ్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రజా గాయకులు ఆరేటి రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, రంగారావులు విప్లవ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, నాగమణి, విజయలక్ష్మి, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ సందడి

విశాలాంధ్ర-తాడికొండ : గ్రామాలలో 2026 న్యూ ఇయర్ సందడి నెలకొంది. మండలంలో ప్రధాన రహదారులు కూడళ్ళు, సెంటర్లలో స్వీట్ షాపులు వెలిశాయి. పలావు హోటళ్ళు, చికెన్, మటన్ షాపులు వద్ద కొనుగోలుదారుల రద్దీ పెరిగింది. న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు కులాలు, పార్టీల వారీగా సిద్ధమయ్యారు. బట్టల షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, చెప్పుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ కనిపించింది. మద్యం షాపులు కిటకిటలాడుతున్నాయి. పలు క్రైస్తవ చర్చిలు న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమయ్యాయి.

రేపటి నుంచి రాజ ముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని జనవరి 2 నుండి 9వ తేదీ వరకు జిల్లాలో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజ ముద్రతో రూపొందించిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 2వ తేదీన ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారని తెలిపారు. మండల స్థాయిలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీల్లో గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పంపిణీ చేస్తారని చెప్పారు. జిల్లాలో మొత్తం 35,690 పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకొని తమ పట్టాలను పొందాలని కోరారు.

పేదలకు వరం.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం

విశాలాంధ్ర-మంగళగిరి : పేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం అని టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. జనవరి నెల 1వ తేదిన పంపిణీ చేయాల్సిన పెన్షన్ నగదును 2026 నూతన సంవత్సరం సందర్భంగా కూటమి ప్రభుత్వం ఒక రోజు ముందుగానే డిసెంబర్ 31న బుధవారం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో గోపాలకృష్ణ థియేటర్ వద్ద గల నాపరాళ్ళ బజార్‌లో పోతినేని శ్రీనివాసరావు కమిషనర్ అలీమ్ భాషతో కలిసి లబ్దిదారుల ఇళ్లకు వెళ్ళి పెన్షన్ నగదును అందజేశారు. పోతినేని మాట్లాడుతూ లబ్దిదారుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతి నెల 1వ తేది లేదా ప్రత్యేక పరిస్థితుల్లో ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేయాలని నిర్ణయించడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. 14వ సచివాలయ పరిధిలో జీఆర్ స్కూల్ వద్ద ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య పెన్షన్ నగదు పంపిణీలో పాల్గొన్నారు. అబద్ధయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓ పక్క అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మరోవైపు సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు నిరంతరం పేద ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి మిర్చి యార్డులోని అన్న క్యాంటీన్ ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్లో పరిసరాల శుభ్రతను, ఉదయం సరఫరా చేస్తున్న అల్పాహారంను పరిశీలించారు. రోజువారీగా అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసే వారి సంఖ్యను, నిర్వహణ, శుభ్రత పనులు తదితర వివరాలను క్యాంటీన్ మేనేజర్ ద్వారా తెలుసుకున్నారు. అల్పాహారం తీసుకుంటున్న పలువురు కార్మికులు, మిర్చి అమ్మకానికి తీసుకువచ్చిన రైతులతో ఆహార నాణ్యత పై అభిప్రాయాలను తెలుసుకున్నారు, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా అల్పాహారంను భుజించి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో నడుస్తున్న అన్నక్యాంటీన్లలో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారంను అందించాలన్నారు. క్యాంటీన్లో భోజనశాల, భోజనాలు సరఫరా చేసే ప్రాంతాలు, క్యాంటీన్ ఆవరణ నిరంతరం శుభ్రపరుస్తూ ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు.

ఎన్‌టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ

మిర్చి యార్డ్ సమీపంలోని సుబ్బారెడ్డి నగర్ లో జనవరి నెల ఎన్ టీ ఆర్ సామాజిక భద్రత పెన్షన్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పలువురు వృద్ధులు వితంతువులకు పంపిణీ చేశారు.

తాడేపల్లిలో పెన్షన్లు పంపిణీ చేసిన రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కూటమి ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా టీడీపీ పట్టణ అధ్యక్షులు వెల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్ యాదవ్, అద్దంకి మురళీ, తాడిబోయిన గోపి, బుర్రముక్కు వెంకటరెడ్డి, తురక దుర్గారావు, మేకా పుల్లారెడ్డి, శ్రీనివాస్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా కల్పించేలా పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : పేదలకు భరోసా కల్పించేలా పింఛన్ల పంపిణీ జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు గోరంట్లలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆనందంగా జీవించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రతి అర్హుడైన వృద్ధుడు, వితంతువు, వికలాంగుడు కూటమి ప్రభుత్వం అందించే పెన్షన్ ద్వారా ఆర్థిక భరోసా పొందుతున్నారన్నారు. పేద ప్రజల జీవితాలను సుస్థిరం చేయడం, వారికి కనీస అవసరాల భరోసా కల్పించడం మన కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఒక్క గోరంట్లలోనే రూ.70 లక్షల వరకు పింఛన్లు పంపిణి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వద్రాణం హరిబాబు, ఘంటసాల సోమశేఖర్, యర్రంశెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామం ఘటనను ఖండించిన వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా

విశాలాంధ్ర-పొన్నూరు : ద్రాక్షారామంలో శివలింగాన్ని ధ్వంసం చేసిన ఘటనను వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండిస్తుందని నియోజకవర్గ అధ్యక్షుడు ఎండి ఖాసిం పేర్కొన్నారు. పొన్నూరులో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. మతాల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్న వాళ్లని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీమళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని భారత జాతి ఐక్యతను కాపాడాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా కోరుకుంటుందని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భరతమాత అలంకరణ భరతజాతి ఐక్యతే భరతమాత మెడలో పూలదండ అవుతుందని ఆయన అన్నారు.

ఎరువుల షాపులు తనిఖీ

విశాలాంధ్ర-పెదకాకాని : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయం నుంచి ప్రత్యేక నిఘా బృందాలు మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామ శివారులో ఉన్న శ్రీ లక్ష్మి నరసింహా ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల గొడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో గొడౌన్ లైసెన్స్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ తనిఖీలలో కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, గన్నవరం ఎం.సునీల్, కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారి బి.సురేష్‌బాబు, స్థానిక వ్యవసాయ అధికారి రమణ కుమార్ పాల్గొన్నారు. ఈ తనిఖీకి వచ్చిన ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్క ప్రైవేటు డీలర్స్, ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీస్, జీడీసీ ఎంఎస్ వారు తప్పనిసరిగా స్టాకు బోర్డులు స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ నిర్వహించాలని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా కూటమి పాలన

విశాలాంధ్ర-మంగళగిరి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గం పెద్దఎత్తున అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పాలనలో నూతన ఒరవడి సృష్టిస్తూ 2025 సంవత్సరంలో చారిత్రక విజయాలను సొంతం చేసుకుందని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం 'స్వర్ణాంధ్ర' దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం సూపర్ హిట్‌గా అమలు చేసిందని వెల్లడించారు. 'తల్లికి వందనం' ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు, 'దీపం-2' పథకం ద్వారా 2 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా 3.25 కోట్ల మందికి లబ్ది చేకూరిందన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా కింద రికార్డు స్థాయిలో రూ.50 వేల కోట్లకు పైగా పెన్షన్లు అందజేశామని తెలిపారు. కేవలం సంక్షేమమే కాకుండా అభివృద్ధికి పెద్దపేట వేసామని అబద్దయ్య అన్నారు. సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నామని, తద్వారా 16.13 లక్షల ఉద్యోగాలకు మార్గం సుగమమైందన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి 'అన్నదాత సుఖీభవ' కింద రూ.6,310 కోట్లు జమ చేశామని, ధాన్యం సేకరణ డబ్బులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. పోలవరం పనుల్లో వేగం పెంచడంతో పాటు, 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడానికి 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేశామని, తద్వారా క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందని తెలిపారు.

కార్యకర్తలకు అండగా నిలిచిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వైసీపీ కార్యకర్త మద్దు సూరి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స అనంతరం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో పూర్తి నిరాశ, నిస్పృహలకు లోనైన ఆ కుటుంబానికి ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కొండంత అండగా నిలిచారు. స్థానిక కార్పొరేటర్ బూసి రాజలత, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్ తదితరులతో కలిసి అప్పిరెడ్డి బుధవారం స్వయంగా వారి ఇంటికి వెళ్ళి వారిలో మనోధైర్యం నింపారు. కుటుంబ సభ్యులతో మమేకమై స్వాంతన చేకూర్చారు. ప్రమాదం జరిగిన తీరుతెన్నులు, గాయాల తీవ్రత గురించి ఆరా తీసి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

పల్నాడు జిల్లా, అమరావతి మండలం, ఉంగుటూరు గ్రామం, డోరు నెం.5-82రు కాపురస్తులు జెట్టి సాంబయ్య గారి భార్య **జెట్టి బుల్లెమ్మ** (సెల్: **63027 52617**) అను నేను తెలియజేయునది ఏమనగా- నా పేరిటకు రిజిష్టరు శ్రీ అమరావతి సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. **188/1984** ఒరిజినల్‌ను నేను ది.**23-09-2025**న ఉంగుటూరు నుండి అమరావతి ఎస్‌ఆర్‌ఓకు ఆటోలో వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు దస్తావేజు దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగదు అందజేత

విశాలాంధ్ర - దాచేపల్లి :స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్లో బస్సు క్లీనరు హుస్సేన్ కు ఇటీవల ప్రమాదం జరగడంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఏఐటీయూసీ కి అనుబంధంగా ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్కూల్ అండ్ కాలేజీ బస్సు డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారంతా కలిసి రూ 5 వేలు వసూలు చేశారు. బుధవారం హుస్సేన్ ఇంటికి వెళ్ళి తమ వంతు సాయంగా ఆయనకు ఆ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమెర వెంకట్రావు, గురజాల నియోజకవర్గ అధ్యక్షుడు వేముల వెంకటరెడ్డి, యూనియన్ అధ్యక్షుడు మొగతాల సైదారావు, కార్యదర్శి ఈసూబ్ బేగ్ (బాజీ), సభ్యులు పాతకోటి జానేష్, మస్తాన్ వలీ, బాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర - దాచేపల్లి : 2025కు వీడ్కోలు చెబుతూ 2026కు స్వాగతం పలుకుతూ బుధవారం అన్ని చోట్ల ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగానే దాచేపల్లి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కోసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కాకుమాను మోజెస్, ఉపాధ్యాయుడు తగరం ఆనంద్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ప్రతి రోజు ఒక కొత్త ఆరంభం కావాలి

-జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రతి జీవితంలో ప్రతి రోజు ఒక కొత్త ఆరంభం కావాలని,2026, నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఓ అందమైన జ్ఞాపకంగా మిగిలి పోవాలని కోరుకుంటున్నట్లు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి చెప్పారు. జనసైనికులకు, వీరమహిళలకు, ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర-దాచేపల్లి : నూతన సంవత్సరానికి సంబంధించిన ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లను బుధవారం ఎంఈఓ పినాకపాణి ఆవిష్కరించారు. ఎస్టీయూ, యూటీఎఫ్ సంఘాలకు చెందిన క్యాలెండర్లతో పాటు పాకెట్ డైరీలను వేర్వేరుగా ఆవిష్కరించిన కార్యక్రమంలో రెండు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగా పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్స్

విశాలాంధ్ర- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వపెన్షనర్ల కు జనవరి 5 వ తేది నుండి ఫిబ్రవరి 29 వ తేది వరకు అమరావతి పెన్షనర్ల సంఘ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్స్ అందిస్తామని పెన్షనర్స్ సంఘ అధ్యక్షులు ఎన్. నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి పి. వెంకటేశ్వర రావు లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్స్ అందరికి ఉచితం గా ఇవ్వనున్నట్లు చెప్పారు. అమరావతి పెదకూరపాడు మండలాల లోని పెన్షనర్స్ అందరు ఈ సదుపాయాన్ని సద్వినియోగపరచు కోవాలని తెలిపారు.

వైద్య రంగంలో పీపీపీ విధానం అవసరం

-ఎంపీ లావు కృష్ణదేవరాయలు

విశాలాంధ్ర-నాదెండ్ల: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను, వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానానికి అందరూ సహకరించాలని నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. బుధవారం పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరంలో కలెక్టర్ కృతికా శుక్ల, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఎంపీ, గత 20 ఏళ్లుగా రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు, 108, 104 సేవలు పీపీపీ పద్ధతిలోనే విజయవంతంగా నడుస్తున్నాయని గుర్తుచేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- సత్తెనపల్లి: పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్ ను బుధవారం సత్తెనపల్లి లో ఏపీ ఎన్. జి. ఓ. తాలూకా యూనిట్ అధ్యక్షులు పి మణిరావు, ఉపాధ్యక్షులు అరుణ కుమార్, యూనియన్ గౌర వాధ్యక్షులు, న్యాయవాది. నరిశేటి వేణుగోపాల్, లు ఆవిష్కరణ చేశారు. పి.డబ్ల్యు.డి. వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్రకమిటి కార్యదర్శి కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ఎత్తి వేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని గౌరవ సుప్రింకోర్టు ఇచ్చిన పిలుపు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలని, పి.ఆర్.సి. కమిటీని వెయ్యాలని పాత పి.ఆర్.సి. బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఎస్.ఎస్. కెనాల్స్ లో పనిచేస్తున్న ఎన్.ఎం.ఆర్.లను కన్వర్షన్ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. వర్క్ ఛార్జి కార్మికులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. లస్కలపై పని భారం పడుతుందని వెంటనే కాలువలపై సిబ్బందిని నియమించాలని కోరారు కార్యక్రమంలో ఎ.ఐ.టి.యు.సి. నాయకులు టి. రామతిరుపతిరావు, కె. శంకర్రావు, యూనియన్ నాయకులు , వర్క్ ఇన్స్పెక్టర్లు, లస్కర్లు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- దుర్గి: మండల యూటీఎఫ్ శాఖ 2026 సంవత్సర వాల్ క్యాలెండర్,డైరీ,పాకెట్ క్యాలెండర్, స్టిక్కర్స్ తయారు చేయించారు.ఈమేరకు స్థానిక యం ఆర్ సి నందు మండల విద్యాశాఖాధికారి యం.డి ఖాసీం, అడిగొప్పల హైస్కూల్ హెడ్ మాస్టర్ ఆర్. చంద్రశేఖర్ లు వాల్ క్యాలెండర్లను బుధవారం ఆవిష్కరించారు.అనంతరం యూటీఎఫ్ నాయకులు డైరీ,క్యాలెండర్ ను యంఈఓకీ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2 నుండి కొత్త పాస్‌పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - వినుకొండ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రభుత్వ రాజముద్ర తో తీసుకువచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం జనవరి 2 వ తారీఖు నుండి ప్రారంభించి రైతులకు ఇవ్వవలసినదిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలం నీలగంగవరం గ్రామంలో జనవరి 2వ తారీకు ఉదయం 10 గంటలకు ప్రారంభం జరుగుతుందని తహసిల్దార్ సురేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్ మరియు వినుకొండ శాసనసభ్యులు జీవి అంజనేయులు పాల్గొంటారు.

సొసైటీల ద్వారా సున్నా వడ్డీకే రైతు రుణాలు

-జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

విశాలాంధ్ర - వినుకొండ :చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు వ్యవసాయ సహకార సంఘాలు (పీ ఏ సీ ఎస్)ద్వారా సున్నా వడ్డీ కే రుణాలు మంజూరు చేస్తున్నట్లు జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు తెలిపారు. వినుకొండ పి. ఏ. సి. ఎస్. కార్యాలయం సొసైటీ వార్షిక ప్రగతిపై బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మక్కెన మాట్లాడుతూ. వినుకొండ పి. ఏ. సీ.ఎస్ పరిధిలో 1900 మంది రైతులకు 47 డ్వాక్రా సంఘాలకు 10 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి, సెంట్రల్ బ్యాంకు ఏజీమ్ సుబ్బారావు, వినుకొండ పి ఏ సీ డైరెక్టర్ శ్రీనివాసరావు, నోడల్ అధికారి రవి, సొసైటీ కార్యదర్శి సికె రెడ్డి, సూపర్ వైజర్ బ్రాహ్మయ్య, వెంకట రత్నం పాల్గొన్నారు.

చంద్రబాబు సంక్షేమం దేశానికే రోల్ మోడల్ : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: దార్శనిక నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమం దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తోందని, పథకాల అమల్లో కూటమిప్రభుత్వం జాతీయస్థాయిలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అనుభవంతో కూడిన చంద్రబాబు పనితీరు.. వినూత్నఆలోచనలతో నిండిన పాలనా సంస్కరణలు రాజకీయ, ఆర్థిక, సామాజిక వేత్తలకే కేస్ స్టడీగా నిలుస్తున్నాయని ప్రత్తిపాటి అభిప్రాయ పడ్డారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని పలు గ్రామాలు, వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లు అందచేశారు. తొలుత నాదెండ్ల మండలం గణపవరం, చిరుమామిళ్ల గ్రామాల్లో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ? దేవరాయలుతో కలిసి పింఛన్లు అందించిన ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. అనంతరం చిలకలూరిపేట మండలం పోతవరం, యడ్లపాడు మండలం జాలాది గ్రామాల్లో, పట్టణంలోని 17వ వార్డులో స్వయంగా ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు చెప్పిమరీ ప్రత్తిపాటి పింఛన్ల సొమ్ము అందించారు. కూటమి పాలనలో ప్రజలందరూ చాలా సంతోషంగా ఉన్నారని.. వైసీపీ నాయకులు.. ఆపార్టీ సానుభూతిపరుల్లో తప్ప, మిగిలిన వారిలో చంద్రబాబు పాలనపై పూర్తిస్థాయి సంతృప్తి కనిపిస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు రాష్ట్ర ప్రయోజనాలకోసం రాజీలేని విధంగా చేస్తున్న కృషిని ప్రజలు గమనిస్తున్నారన్న ప్రత్తిపాటి.. చంద్రబాబు నాయకత్వంలో కూటమిప్రభుత్వమే సుదీర్ఘకాలం అధికారంలో ఉండాలని బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. జగన్ ఆర్థిక విధ్వంసం, పాలన వ్యవస్థల నిర్వీర్యం నుంచి కేవలం ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని గట్టెక్కించడం సామాన్య విషయం కాదన్న ప్రత్తిపాటి.. చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన నాయకుడి వల్లే ఇది సాధ్యమైందన్నారు. 76 ఏళ్ల వయసులో ఏమాత్రం విశ్రాంతి లేకుండా చంద్రబాబు తక్కువ సమయంలో ఇవన్నీ ఎలా చేస్తున్నాడనే ఆలోచన, ఆశ్చర్యం ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరిలో ఉందని ప్రత్తిపాటి తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర- అమరావతి: దేశ సంపదను సృష్టించి ప్రజలకు పట్టెడన్నం పెట్టే రైతాంగ సమస్యలతో పాటు వ్యవసాయ కూలీలు పేద బడుగు బలహీన వర్గ ప్రజలు అన్ని విధాల ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవించాలి అంటే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలుపరచటమే ఏకైక లక్ష్యమని సిపిఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష? అన్నారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని రామకృష? మాట్లాడుతూ పేద ప్రజలకు కుటీర సమస్య పరిష్కారం కావాలంటే అర్హత కలిగిన ప్రతి పేదవారికి నివేశ స్థలాలు ఇవ్వాలని, వాటి నిర్మాణం కోసం ప్రభుత్వపరంగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి నివాసయోగ్యమైన గృహ నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికార యంత్రాంగం యావత్తు కృషి చేయాలన్నారు. అలా చేసిన పేద బడుగు బలహీన వర్గాల హృదయాలలో వెలుగు నింపిన వారవుతారని ఆ దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేయాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన కూటమి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు ప్రజా సంఘ నాయకులు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు రామకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ అమరావతి పట్టణ కార్యదర్శి శీలం ముని,కే మంత్రాలేసు, మేడ మల్లేశ్వరి, టి జానకి తదితరులు పాల్గొన్నారు

ఆదర్శనగర్‌లో సీపీఐ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిడుగురాళ్ల :భారత కమ్యూనిస్టు పార్టీకి 100 సంవత్సరాలు వేడుకల్లో భాగంగా పిడుగురాళ్ల ఆదర్శనగర్ లో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జెండావిష్కరణ జరిగింది. కాలనీలో బుధవారం జరిగిన వేడుకలకు పార్టీ సీనియర్ నాయకులు కాపర్తి వెంకటేశ్వర్లు హాజరై జండావిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తూ పేదల పక్షాన నిలిచిందన్నారు. బలహీనవర్గాలకు ఇళ్ల స్థలాలు, బంజర భూములు పంచడం లాంటి పోరాటాలతో అట్టడుగు వర్గాలకు అభివృద్ధికి అండగా ఉందన్నారు. 17 ఏళ్ళ క్రితం ఈ ఆదర్శనగర్ ఏర్పాటులో సీపీఐ ముందుండి ఇళ్ల స్థలాలు పంచితే పేదలు ఇల్లు నిర్మించుకొన్నా ఇప్పటికీ కాలనీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కావున నేటి కూటమి ప్రభుత్వమైనా స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ శ్రీనివాస్, కోటేశ్వరరావు, కృష్ణ, జాను, వెంకటరమణ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి నిత్యాన్న సేవ ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర-ఈపూరు: అన్నదానం మహాదానం అనే సనాతన ధర్మాన్ని ఆచరణలో నిలిపి, అన్నపూరేశ్వరి వితరణ సేవకుల ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో నిరంతరంగా కొనసాగుతున్న అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సేవ ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 2వ తేదీన ప్రథమ వార్షికోత్సవాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నిత్యాన్నదాన కార్యక్రమం పాలడుగు వెంకటేశ్వర్లు అంకితభావంతో కూడిన సహాయ సహకారాల వల్లనే విజయవంతంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ వార్షికోత్సవ సేవా కార్యక్రమానికి వినుకొండ ఎమ్మెల్యే జీవి అంజనేయులు, శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి, అన్నదాన సేవా మార్గానికి తమ ఆశీస్సులు అందించనున్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, విశాల అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమ ప్రథమ వార్షికోత్సవానికి భక్తులు, దాతలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఆరోగ్యంపై డ్రైవర్లకు అవగాహన

విశాలాంధ్ర - వినుకొండ :వివేకానంద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నరసరావుపేట డాక్టర్స్ అందించే వైద్య సేవలను ఆర్టీసీ డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ డిఎం. జె నాగేశ్వరరావు, సీనియర్ డ్రైవర్స్ ఇన్స్పెక్టర్ (ఎస్. డి. ఐ.), కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షులు కే.రమేష్ కోరారు. బుధవారం ఆర్టిసి బస్టాండ్ కంట్రోల్ పాయింట్ వద్ద డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ కే రమేష్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టిసి ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు డాక్టర్ శాఖమూరి బాజీ బాబు, ఎండి. (డిఎన్‌బి) మాట్లాడుతూ ప్రధానంగా డ్రైవర్లు తమ శరీరాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు కిట్స్, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పేరయ్య, పి.రాఘవ, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్కే.ఖాజా, జి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ అందజేత

విశాలాంధ్ర - వినుకొండ :2026 నూతన సంవత్సరం విశాలాంధ్ర వినుకొండ టౌన్ క్యాలెండర్‌ను బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జె. నాగేశ్వరరావుకు విశాలాంధ్ర విలేకరి అజాద్ అందజేశారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : తహశీల్దార్

విశాలాంధ్ర- దుర్గి: 2026 సంవత్సరం ప్రతి ఒక్కరికీ శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, వెలుగులు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని ఆశిస్తూ మండల ప్రజలకు తహశీల్దార్ వరకుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటికి శ్రీవారి తలంబ్రాలు ప్రసాదం పంపిణీ

విశాలాంధ్ర - పిడుగురాళ్ల :ఇంటింటికీ శ్రీవారి తలంబ్రాలు.. పసుపు, కుంకుమ.. లడ్డు ప్రసాదం పంపిణీ చేస్తూ నియోజకవర్గ ప్రజలందరికీ దేవదేవుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పిడుగురాళ్లలో గత నెల 20వ తేదీన ఎమ్మెల్యే యరపతినేని జరిపించిన "శ్రీనివాసుని కళ్యాణం" మహోత్సవం కమనీయ ఘట్టంగా చరిత్రలో నిలిచింది. ఈ సందర్భంగా, స్వామి వారి తలంబ్రాలు, పసుపు కుంకుమ, లడ్డు ప్రసాదం, స్వామి కళ్యాణ ఫోటో అందించాలని ఎమ్మెల్యే సంకల్పించారు. ఆ సంకల్పానికి జతగా నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, 2026 కొత్త ప్యాకెట్ క్యాలెండరుతో కూడిన ప్రసాదం కిట్టును సిద్ధం చేయించిన యరపతినేని నియోజకవర్గంలోని అన్నీ మండలాల పరిధిలోని గ్రామాలలో కూటమి నాయకులు, కార్యకర్తలను సమయాత్తం చేసి ఇంటింటికి తిరిగి పార్టీలకతీతంగా ప్రతీ కుటుంబానికి స్వామి వారి ప్రసాదం అందజేయించారు. నూతన సంవత్సరంలో అడుగుడుతున్న వేళ శ్రీనివాసుని కళ్యాణోత్సవ ప్రసాదం తమకు అందించటం పట్ల గ్రామాల్లో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సుమారు 80 వేలకు పైగా కుటుంబాలకు శ్రీవారి ప్రసాదలను అందింజేయడమన్నది ఓ ప్రత్యేకమని, నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి వారి మేలు కోసం తితిదే వారిచే శ్రీనివాసుని కళ్యాణం జరిపించి ఆ ప్రసాదాలను అందరికీ అందించాలన్న యరపతినేని సంకల్పానికి ప్రజల నుంచి హర్షాతి రేఖాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రతిష్టాత్మక పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గంలోని తెదేపా, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు కూటమిగా వెళ్లి ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకెళ్లారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - వినుకొండ :ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పేదలకు భరోసాగా నిలుస్తున్నాయని, అభివృద్ధి సంక్షేమం విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, జీవి ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జీవి మాట్లాడుతూ. పేదల సేవలో డబుల్ ఇంజన్ సర్కార్ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నది అన్నారు. త్రిమూర్తులైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లోకేష్ లు ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బొంకూరు రోశయ్య, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కే. నాగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పదవీ విరమణ

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ డిపో లో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుడు కామ్రేడ్ వి.వి. రమణారావు (డ్రైవర్) ఉద్యోగ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపోమేనేజర్ జే.నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఇంచార్జ్ జి.ధనలక్ష్మి , ఆఫీస్ ఇంచార్జ్ బి.మోహనరావు, జోనల్ అసిస్టెంట్ సెక్రటరి కే.హరిబాబు, యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్.కె. ఖాజా, పల్నాడు జిల్లా కోశాధికారి ఎం.పాపయ్య , డిపో అధ్యక్ష ,కార్యదర్సులు డి.జి.విన్సెంట్, పి.సాంబశివరావు, సీసీఎస్ డెలిగేట్స్ వి. శ్రీనివాసరావు,టి.రాంబాబు, జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ వి. సిహెచ్.సైదులు, యూనియన్ నాయకులు కుమార్, ముజీర్, పాలడుగు శ్రీను, రహిమాన్, ఎస్ఎస్ఎన్. రెడ్డి, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - పెదకూరపాడు : శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశం మేరకు పెదకూరపాడు గ్రామం లో మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రమ్మయ్య . డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, ,హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ ఆంధ్ర ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు చెన్నుపాటి బుల్లిబాబు సచివాలయ సిబ్బంది తో సమన్వయం చేసుకుని పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఊటుకురులో పింఛన్లు పంపిణీ

క్రోసూరు- విశాలాంధ్ర: క్రోసూరు మండలం ఊటుకూరులో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముందస్తు పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఒకటవ తేదీ నూతన సంవత్సరం కారణంగా ముందుగానే పెన్షన్ లను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించటంతో ఒక రోజుముందేగానే పేదల ఇళ్లలో పండుగ వచ్చిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అర్హులైన వృద్ధులు,వికలాంగులు,వితంతువులకు ముందుగానే పెన్షన్ లను పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.

వాసవీ సేవా సమితి క్యాలెండర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర - దాచేపల్లి :వాసవీ సేవా సమితి పల్నాడు జిల్లా అధ్యక్షుడు గరిణే పుల్లారావు ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావు, కోశాధికారి గజవెల్లి మునేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు మండ్లెం రామారావు, వైసీపీ నాయకులు కొప్పుల సాంబయ్య, వందనపు వెంకట్రామయ్య, నాగుబండి గురువులు, కొప్పుల రవి, కొత్వాల్ పైడా, సమితి మండల శాఖ అధ్యక్షుడు సాతులూరి సూరి, ప్రధాన కార్యదర్శి కలవల రమేష్, కోశాధికారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై ఆంక్షలు: ఎస్సై రవిబాబు

విశాలాంధ్ర-క్రోసూరు: క్రోసూరు మండల కేంద్రంలో నూతన సంవత్సరం వేడుకలపై అంక్షలు విధించారు. 31న అర్ధరాత్రి రోడ్లపై వేడుకలు నిర్వహించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వివాదాలకు ఘర్షణలకు పాల్పడవద్దని క్రోసూరు ఎస్సై రవిబాబు తెలిపారు. కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో క్రోసూరులో పోలీసువారి ఆంక్షలు ను ఉల్లఘించే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు పర్యవేక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఆర్టీసీ ఉద్యోగులతో డిఎం సమావేశం

విశాలాంధ్ర - వినుకొండ : ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో బుధవారం డిపో మేనేజర్ జే.నాగేశ్వరావు అధ్యక్షతన ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ. ఉద్యోగులంతా సమన్వయంతో పని చేయాలని, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని, అలాగే కిందిస్థాయి ఉద్యో గులతో, కార్మికులతో, సహనంతో, సమన్వయంతో ముందుకు సాగాలని కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టిఐ జి.ధనలక్ష్మి, ఎస్ టి ఐ లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : 2026వ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, వెలుగులు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక శాసనసభ్యులు జీవి ఆంజనేయులు పల్నాడు జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పోడపాడులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర- పెదకూరపాడు: పెదకూరపాడు పోడపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా రబి పంటలైన సెనగ మరియు కంది పంటలను వ్యవసాయ అధికారి కృష్ణయ్య రైతు సేవా కెంద్ర సిబ్బందితో పరిశీలించినారు. శనగలో తెగుళ్ల మరియు పురుగుల యాజమాన్యం తెలిపారు. కంది పంటలో మారుకా, పాడ్ ఫ్లై నివారణ చర్యలు తెలిపినారు. ఇప్పటి వరకు రైతు విశిష్ట సంఖ్య పొందని రైతు సోదరులు రైతు విశిష్ట సంఖ్య నమోదు కొరకు గ్రామ రైతు సేవ కేంద్ర సిబ్బందిని ఆధార్, పట్టాదారు పాసుబుక్, ఆధార్ కి అనుసంధానం అయిన మొబైల్ నెంబర్ తో సంప్రదించ వలసిందిగా తెలియజేసారు, తద్వారా అర్హత కలిగిన రైతు సంక్షేమ పథకాలను పొందవచ్చు అని తెలిపినారు. రబీ లో వేసినటువంటి రబీ పంటలు శనగ మొక్కజొన్న కంది మినుము పెసర నువ్వులు ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపినారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది బి.సంధ్యా భాయి, వి.విదూష, ఆయా గ్రామ రైతు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నేతలపై నియంతలా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-గురజాల: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి విశాఖపట్నంలో పోరాటం చేస్తున్న 5గ్గురు విద్యార్థి సంఘాల నేతలపై రౌడీ షీట్ ఓపెన్ చేయడం దుర్మార్గమని, ఈ చర్యను ఖండిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి పీ. దుర్గాప్రసాద్ విమర్శించారు. గురజాలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎర్రజెండాలు చేత బూని, చేతులకు నల్లని ధరించి ఆందోళన చేపట్టారు. పీ. చంద్రశేఖర్, అయ్యప్ప, పూర్ణ సాయి, గౌతమ్ మరిద్, భాష, జస్వంత్, ఆనంద్, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10వ వార్డులో పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-మాచర్ల : కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమే అన్ని వర్గాలకు క్షేమదాయకంగా మారిందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి వివరించారు. బుధవారం మాచర్ల పట్టణం 10 వ వార్డులోని గౌడ కాలనీ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో పర్యటించి, వృద్దులు, దివ్యాంగులు, వితంతువు తదితరులకు పింఛన్ నగదును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, కొమెరా దుర్గారావు, బృంగా రమణారావు, మాదినేటి శాంతి, వజ్రం నాయక్, మంజుల వెంకటేశ్వర్లు, షేక్ జానీ బాషా, షేక్ సుభాని, చల్లా రాజారత్నం, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.